క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టలబజారులోని బాల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 13నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పరాశరం శ్రీనివాసాచార్యులు, ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. వాహన సేవ, నిత్యహవన కార్యక్రమం, సుదర్శన ఇష్టి, శ్రీవారి పుష్పకైంకర్యం, కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

నకోలి శ్యామలమాత అలంకరణలో సరస్వతి



కాజీపేట: శ్యామల నవరాత్రోత్సవాల్లో భాగంగా కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో జ్ఞాన సరస్వతి అమ్మవారిని నకోలి శ్యామలమాతగా సోమవారం అలంకరించారు. సరస్వతి, గాయత్రిదేవీలను సావిత్రి మూలమంత్రంతో హవనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి మేడారం వెళ్తున్న భక్తులు.. శ్వేతార్క మూలగణపతి ఆలయం దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులకు అభినందన



ఖిలా వరంగల్: ధర్మసాగర్ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 9, 10, 11వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో ఖిలా వరంగల్ మధ్యకోట బాలికల పాఠశాల విద్యార్థులు యశ్వంత్, ముజఫర్ సత్తా చాటారని హెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రెండవ స్థానంలో నిలిచారని వివరించారు. ఈమేరకు పాఠశాల ప్రాంగణంలో యశ్వంత్, ముజఫర్‌ను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

'అతిథి'లో అన్నదానం



హన్మకొండ చౌరస్తా: సీనియర్ జనరల్ సర్జన్ డాక్టర్ అమరనాథ్ జన్మదినం సందర్భంగా రెడ్డి కాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మానసిక దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు కావాల్సిన నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీకాంత్, వేముల శివ, కొప్పు కర్ణాకర్, చెన్నూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం



ఖిలా వరంగల్: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని రెనాల్డ్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫెస్టివల్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకాగా, పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు చేసే కృషిని ఉపాధ్యాయులు వివరించారు. అంతకుముందు ఓ విద్యార్థిని తన తల్లికి మాతృమూర్తి విగ్రహం అందజేసి మాతృప్రేమను చాటుకుంది. వెంకటేష్, శ్రీధర్, శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, మహేష్, శ్రీహరి, వెంకటేష్, సతీష్ రాజు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఖిలా వరంగల్: పడమర కోటకు చెందిన కానిస్టేబుల్ పుట్ట మధు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. 1995వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు, వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు.. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జలగం రమేష్, సెక్రటరీ సంకటాల రవీందర్, కోశాధికారి రింగుల రాజు, దాసరి వీరస్వామి, హనుమాన్ల ప్రభాకర్, మోహన్ తదితరులు ఉన్నారు.

మార్చిలో సహ చట్టంపై సదస్సు

హన్మకొండ: మార్చిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమాచారం హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ తెలిపారు. కలెక్టర్లు, ఆర్డీఓలు, డీఈఓలు, అధికారులు ఈ సదస్సులో పాల్గొంటారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భక్త మార్కండేయ జయంతి

పద్మశాలీల కుల దైవమైన భక్త మార్కండేయ మహర్షి జయంతిని నగరవ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మార్కండేయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పద్మశాలి వంశ మూల పురుషుడు మార్కండేయుడు అని, ఈ వంశ సృష్టికి మూలం అతనేనని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



భట్టుపల్లి రోడ్డులోని వరల్డ్ పద్మశాలి క్లబ్ ఆధ్వర్యంలో మార్కండేయుడి జయంతి వేడుకలు



శివనగర్‌లోని పద్మశాలి కల్యాణ మండపంలో మార్కండేయుడికి పూలమాలలు వేస్తున్న నాయకులు



హనుమకొండ రెడ్డికాలనీలోని భక్త మార్కండేయ పద్మశాలి పరపతి సంఘం కార్యాలయంలో..



హసన్‌పర్తిలోని మార్కండేయ శివాలయంలో..



కాశిబుగ్గ భక్త మార్కండేయ దేవాలయంలో..



కాజీపేట మండలం సోమిడి గ్రామంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలు



ఎల్‌బీనగర్‌లోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు



మడికొండ పద్మశాలి భవనంలో..

నేత్రపర్వంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

హన్మకొండ: హనుమకొండ స్నేహనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మూడు రోజులపాటు జరగనున్న సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు యాజ్ఞిక బ్రహ్మ శ్రీమాన్ వివిఎస్.దేశికన్ స్వామి, ఆలయ అర్చకుడు అనంత వెంకటేశ్వర్లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు మూలమూర్తికి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం అవధూతేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పూజా కార్యక్రమాల్లో స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ కుసుంబ వెంకట్రాం నర్సింహారావు, కమిటీల ప్రతినిధులు భట్టు శశికాంత్ రెడ్డి, ఎన్నమనేని చలపతిరావు, తంగళ్లపల్లి రామబ్రహ్మం పాల్గొన్నారు.



పారాయణం చేస్తున్న కమిటీ సభ్యులు

వైభవంగా గ్రామ దేవత ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ సమీపంలో, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో గ్రామ దేవత బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్, పర్యవేక్షణ కమిటీ కన్వీనర్లు కేడల జనార్దన్, సమన్వయ కమిటీ కన్వీనర్ గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో వేద పండితులు వెలిదె నరసింహామూర్తి, వెలిదె ప్రభాకర్ శాస్త్రి, వెలిదె భార్గవశర్మ, ప్రదీప్ శాస్త్రి నేతృత్వంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు, కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, సర్వప్రాయశ్చిత్తం, ద్వారతోరణ పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాకంకణ ధారణ, అఖండ దీపస్థాపన, నవగ్రహ సర్వతో భద్రమండప ఆవాహనాలు, యజ్ఞం పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

కేయూ క్యాంపస్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గొట్టిముక్కల రమాకాంత్‌రెడ్డి కోరారు. వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన రమాకాంత్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఆల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ బాధ్యులు, కార్యకర్తలు కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్ వద్ద సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రమాకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధికారంలోనికి రావటానికి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎలా కృషిచేశారో అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ సెక్రటరీ పల్లె రాహుల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా వినయ్‌కుమార్, రంగు సుధీర్, వరుణ్‌బాబు, రాంకిగౌడ్, అరుణ్‌రెడ్డి, జన్ను పృథ్వీ, కేయూ అధ్యక్షుడు పాషా, ఇన్‌చార్జ్ ప్రేమ్ సుందర్, కేయూ బాధ్యులు కుమార్, రమేష్ టోని, వర్ధన్నపేట యూత్ ప్రెసిడెంట్ పవన్‌కల్యాణ్, మండల అధ్యక్షుడు సతీష్, ఐనవోలు మండల అధ్యక్షుడు జగన్, హసన్‌పర్తి మండల నాయకులు సునీల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాకాంత్‌రెడ్డి

'కాళేశ్వరం' అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు..



ధర్నా చేస్తున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. నల్లగొండలో సభ నిర్వహించతలపెట్టారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి దుయ్యబట్టారు. ఈమేరకు కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో సోమవారం ధర్నా చేసి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతమవుతాయని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిళ్ల ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, పోరెడ్డి మహేందర్ రెడ్డి, తిరుపతి, లక్ష్మారెడ్డి, జే.రవి, పుల్ల రవి, మురళి, బల్సుకురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ

కాజీపేట రూరల్: కాజీపేట బోడగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆన్‌లైన్ తరగతులకు సోమవారం టీవీని బహూకరించారు. బోడగుట్ట ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయుడు బి.కిరణ్‌రెడ్డి, ఆయన స్నేహితులు కలిసి సుమారు రూ.35 వేల విలువగల ఎల్‌ఈడీ టీవీని పాఠశాల కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి, మండల్ నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, కాజీపేట మండల పీఆర్టీయూ ప్రెసిడెంట్ మాలకొండారెడ్డి సమక్షంలో అందించారు. అలాగే, హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోడగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి అభిరాంకు పలువురు ఆర్థికసాయం అందజేశారు. బి.సంధ్యారాణి, మనోజ్‌కుమార్, స్పుత్నిక్ రూ.5 వేల చొప్పున, మాలకొండారెడ్డి, సునీత రూ.3 వేల చొప్పున ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో అఫ్జల్‌పాషా, గంగుల రాజిరెడ్డి, లింగస్వామి, మహ్మద్ అజీమ్, గుండాల సదానందం, కడారి సమాధానం, అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ, అంగన్‌వాడీ ఆయా నీలమ్మ పాల్గొన్నారు.



పాఠశాలకు టీవీని అందజేస్తున్న ఉపాధ్యాయులు

అనాథ వృద్ధులను అక్కున చేర్చుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేష్‌కుమార్

ఖిలా వరంగల్: అనాథ వృద్ధులను అక్కున చేర్చుకుని, వారికి అండగా నిలవడం అభినందనీయమని రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు, వాసవి క్లబ్ కేసీజీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్‌కుమార్ అన్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ నక్కపల్లి శివారులోని వెలుగందుల అమ్మత స్మారక వృద్ధాశ్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ సోమ శ్రీధర్ ఆధ్వర్యంలో డాక్టర్ సృజన నేతృత్వంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో కేసీజీఎఫ్ ప్రతినిధులు సేవాభావంతో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలని కోరారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించిన వృద్ధులకు డాక్టర్ నరేష్ కుమార్ మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, డాక్టర్ అఖిల్, డాక్టర్ వంశీ, నర్సులు శోభ, రచన, సౌమ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి



ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి

హన్మకొండ: ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి చింతగట్టులో ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. అనంతరం ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఏ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'స్వీప్' విజేతలకు అభినందన

వరంగల్ అర్బన్: ప్రజాస్వామ్య విజయం, ఓటు హక్కు వినియోగంపై పౌరులను చైతన్యవంతులను చేసి, అవకతవకలను అరికట్టడంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గ్రేటర్ వరంగల్ ఇన్‌చార్జ్ కమిషనర్, హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అభినందించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, జిల్లా విద్యాధికారి డాక్టర్ అబ్దుల్‌హై, జిల్లా కోఆర్డినేటర్ (ఐఈ) బోయినపల్లి రాధ, జిల్లా పోటీల సమన్వయకర్త అలిగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, గైడ్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ భూమిని ఇప్పించండి

దేశాయిపేట: వారసత్వంగా సంక్రమించిన ఇంటి స్థలం కోసమే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఎవరిపై ఎలాంటి దౌర్జన్యం చేయలేదని పసునూరి స్వామి అలియాస్ సామేల్, పసునూరి ఏలియా అలియాస్ ఎల్లయ్య తెలిపారు. దేశాయిపేటలో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. తమ తాత పసునూరి ప్రకాశంకు 220గజాల ఇంటి స్థలం ఉండగా ఇద్దరు కుమారులు పసునూరి నర్సయ్య, మొబులుకు 110గజాల చొప్పున పంపకాలు చేస్తూ పెద్ద మనుషులు తీర్మానంచేశారు. భూమి పంపకం కోసం వెళ్లగా.. అడ్డు చెప్పడంతో 16–05–2023న మరోసారి పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన పంచాయితీలో తమ తాత సమాధి, ఇళ్ల మరమ్మతుల ఖర్చుల కింద మొబుకు రూ.1.50లక్షలు పరిహారంగా ఇవ్వాలని పెద్దలు తీర్పునిచ్చారని గుర్తుచేశారు. పంచాయితీ తీర్మానం ప్రకారం రూ.75వేలను అప్పుడే డబ్బులు చెల్లించి, తమ స్థలంలో గోడ నిర్మించిన తర్వాత మిగిలిన రూ.75వేలు 2024, జనవరి 5న ఇచ్చినట్లు వివరించారు. కానీ, అదే రోజు గోడను కూల్చివేశారని తెలిపారు. ఈక్రమంలో ఇంటికి వెళ్లిన తమపై చిన్నాన్న కుమారులు దాడి చేయడంతో గాయాలు కావడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తమకు న్యాయం చేయాలని సీపీని కోరినట్లు చెప్పారు. స్వామి, ఎల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'విజ్ఞానం'పై అవగాహన పెంచుకోవాలి

హన్మకొండ కల్చరల్: విద్యార్థులు జానపద గిరిజన విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఫాతిమా బీఈడీ కళాశాల విద్యార్థులు వరంగల్ హంటర్‌రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయ జానపద గిరిజన విజ్ఞాన పీఠాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జానపదులు, గిరిజనుల వివరాలు, జీవనశైలి, జీవితచక్ర సంబురాలు వంటి పలు విషయాలను విద్యార్థులకు ప్రొఫెసర్ బాబురావు, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు వివరించారు. అనంతరం విద్యార్థులు పీఠంలోని లైబ్రరీ, మ్యూజియంను సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజన విజ్ఞాన పీఠం వద్ద విద్యార్థులు

కందాల శోభారాణికి నివాళి

కేయూ క్యాంపస్: తెలుగు విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు, హక్కుల కార్యకర్త డాక్టర్ కందాల శోభారాణి వర్ధంతిని ఎస్‌ఎఫ్‌ఐ కేయూ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ కేయూ సహాయ కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థులు, సమాజ పురోగమనానికి కృషి చేసిన శోభక్క భౌతికంగా లేకపోవడం బాధాకరమన్నారు. శోభక్క అనుసరించిన విప్లవపంథా, తాను నమ్మిన నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన బాట నిరంతరాయంగా సాగుతుందన్నారు. కార్మికుల పక్షాన ఉండాల్సిన బాధ్యత తామందరిపై ఉందని శోభక్క నమ్మేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ బాధ్యులు అరుణ్, రాకేష్, ఆదిత్య, ఉదయ్, అజయ్, సందీప్, సాత్విక్ పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు రైతులు ఉద్యమించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, డిమాండ్ల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు అన్నారు. వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవన్‌లో భాషిపాక రమేష్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ ఆరుగాలం కష్టం చేసి ప్రజలకు అన్నం పెడుతున్న అన్నదాతల ఆత్మహత్యల నివారణకు, వారికి ఆర్థిక భద్రతను కల్పించడంలో పాలకులు విఫలమయ్యాయని విమర్శించారు. సమగ్ర వ్యవసాయ విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి గోనె కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యారంగ సమస్యలపై పోరాటం

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై పోరాడాలని, అలాగే తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబీఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏబీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం గురించి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి దూడపాక శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు సింగారపు అరుణ్, బాధ్యులు దేవేందర్, చంటి, సందీప్, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలాగే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగానికి తక్కువగానే నిధులు కేటాయించిందని వాపోయారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు హాతిరాం, అనూష, ఉదయ్, ఇస్మాయిల్, జస్వంత్, సందీప్, రాకేష్, పవన్ కల్యాణ్, గణేష్, నాగేందర్, రాజ్‌కుమార్, వినయ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల పోస్టింగ్‌లు పొందిన ఇన్‌స్పెక్టర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేశారు. సీపీని కలిసిన వారిలో సుబేదారి సీఐ వాసుదేవరావు, మడికొండ సీఐ ప్రతాప్, ఏనుమాముల సీఐ కిషన్, మామునూర్ సీఐ రవికుమార్, శాయంపేట సర్కిల్ సీఐ రంజిత్‌రావు, నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ వేణు, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏనుమాముల సీఐ బాధ్యతల స్వీకరణ

వరంగల్: ఏనుమాముల పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పుల్యాల కిషన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన సీఐ మహేందర్.. ఎస్‌బీ వరంగల్ కమిషనరేట్‌కు, నర్సంపేట రూరల్ సీఐగా పనిచేస్తున్న పుల్యాల కిషన్ ఏనుమాములకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన కిషన్‌కు ఎస్సై పోగుల శ్రీకాంత్, రాజు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

సుబేదారి ఇన్‌స్పెక్టర్‌గా వాసుదేవరావు బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.వాసుదేవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. వాసుదేవరావును సుబేదారి పోలీస్ స్టేషన్ సిబ్బంది, సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

సీఐ మల్లయ్యకు శుభాకాంక్షలు

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లయ్యను శివనగర్‌కు చెందిన సార సాంబయ్య, కొయ్యడ ప్రవీణ్‌కుమార్, తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీకి సన్మానం

కాజీపేట రూరల్: సికింద్రాబాద్‌లో సోమవారం జరిగిన దక్షిణ మధ్య రైల్వే సీసీఎస్ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ నుంచి ప్రెసిడెంట్‌గా చిలుక స్వామి, వైస్‌ప్రెసిడెంట్‌గా రాంమోహన్‌లు విజయం సాధించినట్లు కాజీపేటకు చెందిన రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ తెలిపారు. గెలుపొందినవారిని మజ్దూర్ యూనియన్ నాయకులు సన్మానించారు.

టీసీఆర్‌పీఏ డైరీ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: తెలంగాణ క్లస్టర్ రిసోర్సు పర్సన్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం –2024 డైరీని హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై సోమవారం ఆవిష్కరించారు. టీసీ ఆర్‌పీఏ జిల్లా అధ్యక్షుడు గోవిందునరేష్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, ఏఎస్‌ఓ విజయ్‌కుమార్, ఏపీఓ వినయ్‌కుమార్, సీఆర్‌పీఏ ముఖ్య సలహాదారు మొగిలిచర్ల శ్రీనివాస్, డీఎల్ఎంటీ రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



విద్యారణ్యపురి: విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావు సూచించారు. ఎల్లాపూర్ శివారులోని ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని కెనవో –2024 పేరుతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్.. తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. సామాజిక వేత్త అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ దేశం.. కుటుంబ వ్యవస్థకు మూలమని వివరించారు. ఎంఈఓ రాంకిషన్‌రాజు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.